ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (సఖినేటిపల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 10-2-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీత అంటే భగవంతుడు చేసిన ప్రసంగము. భగవద్గీతను చదివి అర్థంచేసుకొంటే ఇంక ఏ పుస్తకము కూడా చదవవలసిన పనిలేదు. అయితే భగవద్గీతమీద మనకు ఇష్టం కలగటంలేదు, అభిలాష కలగటం లేదు. దీనికి మనలోని దోషములే కారణము. మనం బాగుపడటానికి భగవద్గీతలో ఒక్క శ్లోకం చాలు. మనలను దుఃఖములోనుండి విడుదల చేయటానికి ఒక్క శ్లోకం చాలు. రోజు ఒక్క శ్లోకాన్ని తీసుకొని దానిని శ్రవణం చేసి, మననం చేసుకొని, దానిని అర్థం చేసుకొంటే మీరు బాగుపడతారు. అందువలన మీరు భగవద్గీతను విడిచిపెట్టవద్దు. భగవద్గీతను అనుదినము పారాయణ చేయండి. పారాయణ చేస్తే పుణ్యం వస్తుంది. అర్థంచేసుకొని ఆచరిస్తే మోక్షం వస్తుంది.

కృష్ణుడు పార్థుడికి సారధ్యం వహించాడు కాబట్టి ఆయనను పార్థసారథి అంటారు. కృష్ణుడు తోలిన రథానికి నాలుగు గుర్రాలు. భగవద్గీతలో నాలుగు యోగాలు (1) కర్మయోగము, (2) భక్తియోగము, (3) రాజయోగము, (4) జ్ఞానయోగము. నాలుగు గుర్రాల సాయంతో ఆ రథం ఎలా ముందుకు వెళ్ళిందో అలాగే మన జీవితం అనే రథాన్ని ఈ నాలుగు యోగములు ఆశ్రయించి ముందుకు నడుపుకొని తరించమని భగవంతుడు చెప్పాడు. ఈ యోగములు ఒకదానికొకటి విరోధమయినవి కావు. మన పూర్వజన్మ సంస్కారమునుబట్టి ఒకో మార్గమువైపుకు ఆకర్షింపబడతాము. ఒక యోగంలో ప్రయాణించేవారు ఇంకో యోగములో ఉన్నవారిని ఆక్షేపించకూడదు. ఒక యోగం ఎక్కువ, ఇంకో యోగం తక్కువ కాదు. మీరు ఏ యోగంలో ప్రయాణం చేసినా మనస్సు నశించాలి.

మన మనస్సును ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలి. అయితే మనస్సును అదుపులో పెట్టుకోవటం అంత తేలిక కాదు. మనస్సు చాలా బలమైనది, ధృడమైనది. గాలిని మూట కట్టగలవు గాని మనస్సును స్వాధీనం చేసుకోలేవు, దానిని నిగ్రహించటం చాలా కష్టం అని చెప్పిన కృష్ణుడే వైరాగ్యం, అభ్యాసములవలన అది స్వాధీనం అవుతుంది అని చెప్పాడు.

కొంతమంది స్త్రీలకు తన శరీరంకంటే, తన గర్భంనుండి పుట్టిన పిల్లలకంటే సహజముగా భర్తమీద ఎక్కువ ప్రేమ ఉంటుంది. అలా సహజముగా భర్తమీద ప్రేమ ఉన్న స్త్రీకి ఆ భర్తమీద ఎంత ప్రేమ ఉందో, బాగా పిసినారికి తన డబ్బుమీద ఎంత ప్రేమ ఉందో, కీర్తి కాంక్ష ఉన్నవాడికి ఆ కీర్తిపట్ల దృష్టి ఎలా ఉంటుందో అలాగ భగవంతునిపట్ల ఉంటే చాలు మీకు జ్ఞానం వస్తుంది అని రామకృష్ణుడు చెప్పాడు. దేవుని తెలుసుకోవాలి అంటే మీరు ఎక్కువ కష్టపడనక్కరలేదు. భోజనాలు, నిద్ర మానివేయనక్కరలేదు. పిసినారికి తన డబ్బుమీద ఎంత ప్రీతి ఉందో అంత ప్రీతి మీకు దేవునిమీద ఉంటే ఇప్పుడే, ఇక్కడే ఈ దేహంలో ఉండగానే ఈ భూమిమీద ఉండగానే భగవంతుడు తెలియబడతాడు.

నన్ను ప్రేమించు, నన్ను ధ్యానించు, నాకోసం పని చెయ్యి, నన్ను పొందటమే గమ్యంగా పెట్టుకో. మిగిలినవి అన్నీ స్వప్నసమానము అని భగవంతుడు చెపుతున్నాడు. బాహ్యంగా నీకు మెరుగులు, ఆడంబరములు

కనబడినా అవి అన్నీ స్వప్నసమానమే. మీరు ఏవైతే విలువైనవి అనుకొంటున్నారో కాలప్రవాహములో అవి అన్నీ కాలి బూడిద అయిపోతాయి. మీ పనికి నేనే ధ్యేయం అయిఉండాలి, మీ జపానికి నేనే ధ్యేయం అయిఉండాలి, నీ శక్తులు అన్నీ నాయందే కేంద్రీకరింపబడాలి అని భగవంతుడు చెపుతున్నాడు.

భగవంతుడు ఉన్నాడా, లేడా అనే అనుమానం వద్దు. భగవంతుడు ఉన్నమాట నిజం. ఇందులో సందేహించవలసిన పనిలేదు. శాస్త్రములో చెప్పిన విషయాలు ఎవరికైనా సందేహం కలుగుతూ ఉంటే దానికి మనలోని దోషములే కారణము. కొంతమందికి అర్థంచేసుకొనే శక్తి ఉండదు. వాక్యమును చదివినా ఈ వాక్యమును భగవంతుడు ఎందుకు చెప్పాడు, ఈ వాక్యములో ఉన్న సారాంశము ఏమిటి అని గ్రహించే శక్తి వారిలోపల ఉండదు. ఇటువంటివారిని ప్రమాణంగా తీసుకోకూడదు. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకొని మన జీవితమును సరిదిద్దుకోవాలి. మన జీవితానికి ఏ గుణాలు అయితే సహకరిస్తున్నాయో వాటి సహకారం తీసుకొని, ఏ గుణాలు అయితే సహకరించటం లేదో వాటిని తీసి బయట పారవేయాలి. ఈ రకంగా జీవించటం అలవాటు చేసుకోవాలి. భగవద్గీతను ఆధారంగా చేసుకొని మన జీవితమును తీర్చిదిద్దుకోవాలి.

మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేనే మనకు మోక్షం రాకుండా అడ్డు వస్తోంది అన్న సంగతి ఈ నాటికి కూడా మనకు అర్థంకావటంలేదు. భక్తిమాట వదలివేయండి, విచారణ మాట వదిలివేయండి. ఈ నేనును తొలగించుకోగలమా, లేదా అనే మాట వదలివేయండి, ఏ నేనుకోసం అయితే నీవు అందరితోటి విరోధాలు పెట్టుకొంటున్నావో, ఏ నేనును అయితే నీవు ప్రేమిస్తున్నావో ఆ నేనే నీకు మోక్షం రాకుండా అడ్డువస్తోంది అనే గుర్తింపు ఈ నాటికికూడా నీకు రాలేదు అంటున్నారు రమణమహర్షిగారు. విచారణ చేసి తొలగించుకోగలమా, లేదా అనేది వేరే విషయం. అదే నీకు అడ్డు వస్తోంది అన్న సంగతి ఈనాటికి కూడా నీ బుర్రకు తట్టటంలేదు. ఏదైతే నిన్ను పాడు చేస్తోందో దానిమీదే నీకు ప్రేమ, దానికోసమే నీవు జీవిస్తున్నావు. ఈ నేనే నీకు అన్ని తంటాలు తీసుకొనివస్తోంది. ఆ నేనును తీసుకొని వెళ్లి ప్రక్కన పెట్టు. నాకోసం పని చెయ్యి, నాకోసం జీవించు, మిధ్యానేనును కాదు ధ్యేయంగా పెట్టుకోవలసినది. దానిని ఒక ప్రక్కన పెట్టి నన్నే ధ్యేయంగా పెట్టుకొని, నన్ను ప్రేమిస్తూ, నన్ను ధ్యానిస్తూ, నాకోసమే పనిచేస్తే నీ ముక్కులో గాలి బయటకు వెళ్ళకముందే నాలో ఐక్యం చేసుకొంటాను అని భగవంతుడు చెపుతున్నాడు. మనం ఏపని చేసినా దృష్టి అంతా భగవంతునిమీద ఉండాలి, ఈ శవాల మీద కాదు.

మీరు ఎంత డబ్బు సంపాదించినా మరణానంతరము అది మీకూడా రాదు. పైగా మీకుటుంబములో కలహాలను ఆ డబ్బే కారణం అవుతుంది. మీరు ఒక మంచిగుణం సంపాదించుకొంటే రాబోయే జన్మలలోకూడా ఆ గుణం మీ కూడా వస్తుంది. మీకు జ్ఞానం కలగటానికి అది సహకరిస్తుంది. అందువలన సత్పురుషులతో సహవాసం చెయ్యండి. సత్పురుషులతో సహవాసం చేయటంవలన వారిలో ఉన్నగుణాలు మనం కూడా సంపాదించుకోవాలి అనే బుద్ధి మనకు కలుగుతుంది.

మనస్సును జయించటం కష్టం అనిపిస్తుంది. కాని భగవంతుని ప్రేమిస్తే ఆ ప్రేమలో ఈ మనస్సు కరిగిపోతుంది. మనస్సును జయించకుండా ఈ ప్రపంచమును ఎవడూ జయించలేడు. నీ మనస్సును స్వాధీనం చేసుకొంటే ఈ లోకం అంతా నీకు స్వాధీనం అవుతుంది. ఈ లోకము, ఈ దేహము, రాబోయే జన్మలు అన్నీ కూడా మనస్సు కల్పితమే. స్వర్గములు, నరకములు కూడా మనస్సు ఉన్నంతసేపు అవి ఉన్నమాటకూడా నిజమే. మనస్సులోనే ఈ కీలకం అంతా ఉంది. అందుచేత నీవు చేసే పని మనస్సు నశించటానికి సహకరించాలి.

ప్రాణం పోయే టైములో నీ శరీరం శవం అయ్యే టైములో నా స్మరణ మీకు ఉంటే, నా ధ్యాస గనుక మీకు ఉంటే నా స్వరూపమును మీకు ఇస్తాను అని కృష్ణుడు గీతలో చెప్పాడు. ఇప్పటినుండి అంటే ఈరోజునుండి మనకు ఏ రోజు మరణం వస్తుందో అప్పటివరకూ భగవంతుడినే స్మరిస్తూ ఉంటే, భగవంతుడినే ధ్యానిస్తూ ఉంటే, భగవంతునికోసమే పనిచేస్తూ ఉంటే చివరిటైములో ఆయన జ్ఞాపకం వస్తాడు. మరణించే సమయంలో మనం అనుకొన్నది మన బుర్రలోనికి రాదు, ఉన్నదేదో వస్తుంది.

నీ మనస్సును వదిలివేయకు. నీ హృదయంలో బంధించి, నీ హృదయంలో నిరోధించి, నిలబెడితే అది నశిస్తుంది అని గీతలో చెప్పాడు. నీ దుఃఖమునకు కారణము నీ మనస్సే అని నీకు తెలియటంలేదు. నీవు ఎవరికోసమైతే జీవిస్తున్నావో పరిణామంలో వారే నీకు దుఃఖమును తీసుకొనివస్తారు. ఈ విషయమును నీవు గ్రహించుట లేదు.

అందరి హృదయములలో చైతన్యముగా ఉన్నాను, ఆత్మగా ఉన్నాను అని పరమేశ్వరుడు చెపుతున్నాడు. ఉంటే మాకు ఎందుకు తెలియటంలేదు అని అడుగుతున్నారు. ఆయన ఎందుకు తెలియటంలేదు అంటే మనస్సే నువ్వు అనుకొంటున్నావు, దేహమే నువ్వు అనుకొంటున్నావు. నీవు ఏదైతే కాదో దానిని అవును అనుకోవటం మానివేస్తే హృదయంలో ఉన్న వెలుతురు ఇప్పుడే, ఇక్కడే నీకు ఎరుకలోనికి వస్తుంది అంటున్నాడు పరమేశ్వరుడు. నీవు దేహముతోటి, మనస్సుతోటి పరిమితం చేసుకొంటున్నావు. ఆ పరిమితబుద్ధిని గనుక విడిచిపెడితే ఎప్పుడో వస్తుంది అనుకొన్నది ఇప్పుడే వచ్చేస్తుంది. నీ మనస్సు హృదయంలో ఎప్పుడైతే కరిగిపోయిందో నీ హృదయంలో ఉన్న శాంతి ప్రవాహము వచ్చి నీ శిరస్సును ముంచివేస్తుంది.

పుణ్యమైనా, పాపమైనా అబద్ధమైన నేనుకే. పుణ్యం చేస్తే భోగం అనుభవిస్తుంది. పాపం చేస్తే దుఃఖము అనుభవిస్తుంది. ఇవి దేహగతమైన నేనుకే. నిజమైన నేనుకు వీటితో సంబంధం లేదు. నీవు చేసే పుణ్యం, పాపం అబద్ధమైన నేను మీద ఆధారపడి ఉన్నాయి. వాడుపోతే ఇవి అన్నీ పోతాయి. అబద్ధమైన నేను ఉన్నంతసేపు పుణ్యం, పాపం ఇవి అన్నీ ఉన్నమాట నిజమే. ఇవి అన్నీ స్వతంత్రమైన సత్యాలు కావు. ఇవి వ్యవహారిక సత్యాలు మాత్రమే. ఒక్క భగవంతుడు మాత్రమే పారమార్థిక సత్యము. పోలికలవలన మనకు దుఃఖము వస్తుంది. వంద ఎకరాలు ఉన్నవాడు రెండు వందల ఎకరాలు ఉన్నవాడితో పోల్చుకొని బాధపడుతూ ఉంటాడు. ఇలా పోల్చుకోవటంవలన దుఃఖము వస్తుంది.

అంతఃకరణము అంటే లోపలఉన్న పనిముట్టు. అదే మనస్సు. సబ్బుతో మీ శరీరమును ఎలా శుభ్రం చేసుకొంటున్నారో పూజతో, జపంతో, ధ్యానంతో మీలోపల ఉన్న పనిముట్టునుకూడా కడిగి శుభ్రంచేసుకోవాలి. అంటే ప్రార్థనలేకుండా రోజు గడపకూడదు. మీరు తిండిలేకుండా రోజు ఏవిధంగా గడపరో అలాగే ప్రార్థనలేకుండా, జపంలేకుండా, ధ్యానంలేకుండా రోజు గడపకూడదు. రోజూ ఈ శవానికి ఏవిధంగా అయితే స్నానం చేయిస్తున్నారో అలాగే మనస్సుకు కూడా స్నానం చేయించాలి. భగవంతుని రూపమును ధ్యానించటం, ఆయన నామమును స్మరించటం అదే మనస్సుకు స్నానం. నీ మనస్సుకు పరిశుద్ధత వచ్చినపుడు మాత్రమే నీవు హృదయం అనే ఆలయంలోనికి ప్రవేశించగలవు. లోపల ఉన్న దేవుడు ఎంత పవిత్రంగా ఉన్నాడో, ఎంత సూక్ష్మంగా ఉన్నాడో, ఎంత నిర్మలంగా ఉన్నాడో నీ మనస్సుకూడా అంత నిర్మలంగా, పవిత్రంగా అయితే పరిశుద్ధమైన నీరు, పరిశుద్ధమైన నీటిలో ఐక్యం అయినట్లు ఈ మనస్సు భగవంతునిలో ఐక్యం అవుతుంది అని శాస్త్రము చెపుతోంది.

మనో మూలములోనే చైతన్యం ఉంది, దేవుడు ఉన్నాడు అని చెపుతున్నారు. నీవు తెలుసుకోవలసిన వస్తువు మనోమూలంలోనే ఉంది అని చెపుతున్నారు. (నాకు కావలసినది ఈ గొడవలు కాదు నాకు

B

ఆనందముకావాలి. శాంతి కావాలి. నేను అశాంతితో కాలిపోతున్నాను. దేవుడు గొడవ చెపితే నాకు ఎందుకు? నాకు కావలసినది శాంతి, ఆనందము. దానికి ఏదైనా ఉపాయం చెప్పండి అని భగవాన్‌ను అడుగుతున్నాడు. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే నీవు ఆనందము కావాలి అంటున్నావు. అది నీవు కష్టపడి సంపాదించేది కాదు. నువ్వు ఆనందమే. నీ స్వరూపము ఆనందమే. ఆనందమే నీవు అయిఉండి ఆనందంకోసం వెతుక్కొంటున్నావు. నీవు ఎవరో నీకు తెలియకపోవటంవలన నీకు కోరిక కలుగుతోంది. నీ స్వరూపమే ఆనందము అన్న సంగతి నీకు తెలియకపోవటంవలన నాకు ఆనందము కావాలి అంటున్నావు. నీ స్వరూపమే ఆనందము అన్న సంగతి నీకు తెలిస్తే ఆనందముకావాలి అనే కోరికే నీకు ఉదయించదు. నీపేరే ఆనందము. నీపేరే శాంతి. నీ పేరే మోక్షం అంటున్నారు భగవాన్.

నీవు మోక్షంలోనే ఉన్నావు. కాని నీవు మోక్షంలోనే ఉన్నావన్న సంగతి నీకు తెలియటంలేదు. ఏ కారణంవలన నీవు మోక్షంలో ఉన్నావన్న సంగతి నీకు తెలియటంలేదో ఆ కారణము నశిస్తే నీవు మోక్షంలోనే ఉన్నావని నీకు తెలుస్తుంది. నీవు మోక్షంలోనే ఉన్నావని నీకు ఎప్పుడైతే తెలిసిందో అప్పుడు మోక్షానికి సంబంధించిన ఆనందము వచ్చి నిన్ను ముంచేస్తుంది. నీవు మోక్షంలోనే ఉన్నా మోక్షంలో ఉన్నాను అని నీకు తెలియకపోవటానికి కారణము మోహం. మోహం నశించిన మరుక్షణంలో నీవు మోక్షంలో ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తుంది. నీవు చేసే సాధనలు, పూజలు, నదులలో మునగటాలు, జపాలు అన్నీకూడా మోహం నశించటానికే. మోక్షములోనే ఉన్నాను అని నీకు ఎప్పుడైతే తెలిసిందో మోక్షంలో ఉన్నది ఆనందమే కాబట్టి నీవు ఆనందముగా ఉంటావు.

శ్రవణం చేసిన మాటలను మననం చేసుకోండి. మీరు శ్రవణం చేసిన మాటలలో మీకు ఉపయోగపడేవాటిని పుస్తకంలో వ్రాసుకొని వాటిని ధ్యానం చెయ్యాలి. మాట దేవుడై ఉన్నది. మాటకూడా మీకు వెలుగును చూపిస్తుంది. దేవుని దగ్గరకు వెళ్ళటానికి దారిని చూపిస్తుంది. చిల్లర గొడవలకు మీ తెలివిని, శక్తిని పాడుచేసుకోవద్దు. కుటుంబపరంగాగాని, సమాజపరంగాగాని వచ్చే అనవసరమైన గొడవలకు మీ శక్తిని పాడుచేసుకోవద్దు. ఇంటికి చుట్టాలు వస్తే రూపాయలు పొయ్యిలో పెట్టి కాఫీ కాచి ఇవ్వటం ఎటువంటిదో చిల్లరగొడవలకు నీ శక్తిని పాడుచేసుకోవటంకూడా అటువంటిదే.

ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి మించిన సుఖం లేదు అని నీకు తెలుస్తుందో అట్టి సుఖాన్ని పొందు అని కృష్ణుడు చెప్పాడు. అన్ని సుఖాలలోనికి మోక్ష సుఖం గొప్పది. మోక్ష సుఖమునకు మించిన సుఖం లేదు. దేహంకంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే ఆత్మ గొప్పది అని కృష్ణుడు చెప్పాడు. అన్నిటికంటే ఆత్మగొప్పది అటువంటి ఆత్మ సామ్రాజ్యంలోనికి ప్రవేశించమని గీతాచార్యుడు చెపుతున్నాడు. ఆత్మ అంటే చైతన్యమే. అంటే జీవితగమ్యం ఆ చైతన్యంలో ప్రవేశించటమే.

చాలామంది మేధావులు దేహందాటి, ఇంద్రియాలు దాటి, మనస్సునుదాటి బుద్ధి దగ్గర ఆగిపోతున్నారు. మేము చాలా తెలివైనవారము అనివారు అనుకొంటూ ఉంటారు. కుంటివాడిని నడువు నడువు అంటే ఏమి చేస్తాడు. వాడు నడవలేడు. నడవలేని దానికి వాడిని విమర్శిస్తే ఏమిలాభం. అలాగే మానవుడి బుద్ధి కుంటిది. దానిని ఎంత తరిమినా కొంత దూరం వెళుతుంది గాని గమ్యమును చేరలేదు. గమ్యానికి వెళ్ళాలంటే భగవంతుని అనుగ్రహంవలననే చేరగలము. మనబుద్ధివలన చేరలేము. అందువలన శాస్త్రమును ప్రమాణంగా తీసుకో. భగవంతుని వాక్యమును ప్రమాణంగా తీసుకో, నీ బుద్ధిని ప్రమాణంగా తీసుకొంటే నీవు దూరం ప్రయాణం చెయ్యలేవు. భగవంతునిలో ఐక్యం అవ్వలేవు. బుద్ధిని ఉపయోగించుకో అంతే. ఎవడైతే సాధనచేసి తనబుద్ధిని సంస్కరించుకోడో వాడిని సంసారం జన్మజన్మలకు విడిచిపెట్టదు. తాత్కాలికంగా

ఏదో ఆనందముగా ఉంది అని రోజులు ఎప్పుడూ ఇలాగే ఉంటాయని అనుకోవద్దు. నీ ఆనందము అంతా దుఃఖముగా మారటానికి ఎంతోకాలము పట్టదు.

నీవు ఆనందము కావాలి అంటున్నావు. గాఢనిద్రలో నీవు ఆనందముగానే ఉన్నావు. మెలుకువలోనికి వచ్చాక ఆ ఆనందము పోతోంది. గాఢనిద్రలో ఉన్న మనిషి, మెలుకువలో ఉన్న మనిషి వేరుకాదు. ఆ మనిషే ఈ మనిషి. కాని గాఢనిద్రలో ఉన్న ఆనందము మెలుకువలో నీకు అందటములేదు. దీనికి కారణము ఏమిటి? అడ్డువచ్చినవాడు ఎవడు? అని సూక్ష్మబుద్ధిని ఉపయోగించి విచారణ చేసి వాడిలోనుండి విడుదలపొందు. ఇప్పుడు మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతుందో అదేనీకు అడ్డువస్తోంది. అదే అహంభావన. ఈ నేనును ఎవడైతే విడిచిపెట్టాడో వాడికి గాఢనిద్రలో ఏ ఆనందము అయితే ఉందో అది మెలుకువలో కూడా అనుభవంలోనికి వస్తుంది. మీకు ఎంత వయస్సు వచ్చినా అడ్డువచ్చేవాడిని విచారణ చేయటంలేదు. విచారణ కొద్దిగా ప్రారంభించండి. విచారణ ప్రారంభిస్తే మీ అహంభావన పోతుంది. అహంభావన అనేది దేహమునకు సంబంధించినది కాదు, ఆత్మకు సంబంధించినది కాదు. మధ్యలో వచ్చింది. కొద్దిగా విచారణ చేస్తే అది పోతుంది. అప్పుడు నాకు ఆనందము కావాలి అని నీవు అడగనక్కరలేదు. నీవు ఆనందమే అని నీకు తెలుస్తుంది. బ్రహ్మానుభవం కలిగినపుడు సముద్రంలో ఎంతనీరు ఉందో అంత ఆనందమును మీరు అనుభవించవచ్చును.

డబ్బును, గౌరవాన్ని ఎలా సంపాదించుకొంటున్నారో అలాగే దేవుని అనుగ్రహాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను మనం పొందలేము. ఏదో గొడవలలో ఉండి ఒకోసారి దేవుని మర్చిపోతాము. సడన్‌గా దేవుడు జ్ఞాపకం వస్తూ ఉంటాడు. దేవుడు జ్ఞాపకం వచ్చాడు, దేవుడిని తలపెట్టుకొంటున్నాము అనుకొంటాము. దేవుడు మనలను తలపెట్టుకోవటంవలననే దేవుడు మనకు జ్ఞాపకం వచ్చాడు అనే బుద్ధి మనకు రావటంలేదు. దేవుడు మనకు జ్ఞాపకం రావటంకూడా ఆయన అనుగ్రహమే.

నా కృప గురించి సందేహించవద్దు. నీవు చేయగలిగిన కృషి చెయ్యి. నీ చేతిలో ఉన్న కృషి ఏదో చెయ్యి. నా కృప గురించి అనుమానించవద్దు. నా కృప ఉండనే ఉంది. నా చేతిలో ఉన్న పనిని గురించి అనుమానం పెట్టుకోవద్దు. నీ చేతిలో ఉన్న పనిని విశ్వాసంతో చెయ్యి. శ్వాసపోయినా విశ్వాసం పోకూడదు. అలాగ విశ్వాసంగా ఉండు. అప్పుడు నీవు తగిన విధంగా బహూకరించబడతావు అని భగవంతుడు చెపుతున్నాడు.

ఇప్పుడు మనం సుఖంకోసం, ఆనందం కోసం ఇతరులమీద ఆధారపడి ఉన్నాము. బ్రహ్మానుభవం కలిగినపుడు మనం ఆనందంకోసం ఇతరులమీద ఆధారపడనక్కరలేదు. స్వతంత్రమైన సుఖము, ఆనందము మన హృదయంలోనుండే అందుతూ ఉంటుంది. అప్పుడు బానిసత్వం నశిస్తుంది. దేనిని తెలుసుకొన్నాక ఇంక తెలుసుకోవలసినది ఉండదో దానిని తెలుసుకోమని కృష్ణుడు పదేపదే చెపుతున్నాడు. మిగిలినవన్నీ స్వప్నసమానము. జీవితంలో నీవు ఏదైనా సాధించవచ్చు. అది తప్ప నీవు ఏది సాధించినా స్వప్నంలో కనబడే పదార్థములు ఎంత నిజమో ఇవికూడా అంతే నిజము.

మీ అశాంతికి దేహగతమైన నేనే కారణము. ఇది గ్రహించండి. నెపాలు ఎవరిమీదా పెట్టవద్దు. మీ హృదయంలో ఉన్న నిజం తెలిసేవరకూ నిజంకానిది నిజంవలె మీకు కనిపిస్తుంది. నిజంకాని దానిమీద నీ మనస్సును వాలకుండా చేసేవాడే గురువు. గురువు హృదయంలోనే ఉన్నాడు కదా. శిష్యుడికి తనమీద ప్రేమ కలిగేటట్లు, ఆకర్షణ కలిగేటట్లు చేసుకొని వాడి స్వరూపమును శిష్యునికి ఇచ్చేవరకూ శిష్యుని విడిచిపెట్టడు వాడు గురువు.

నీవు ఆనందములోనే ఉన్నావు. కాని ఆనందములో ఉన్నాను అన్న సంగతి నీకు తెలియటంలేదు. అదే అజ్ఞానము అంటున్నారు భగవాన్. ఆనందమే నీవు అని తెలియక దానికోసం బయట వెతుకుచున్నావు. బయటవెతుకుచున్న నిన్ను అంటే నీ మనస్సును ఆ విషయములనుండి మరలించి లోపలకు గెంటుతాడు బాహ్యగురువు. లోపల ఉన్న గురువు నిన్ను లోపలకు గుంజుకొని తన స్వరూపమును ఇస్తాడు.

బయట గురువు శరీరం ధరించి ఉంటాడు. లోపలగురువు ఆత్మగా ఉంటాడు.

దేహం చనిపోయిన వెంటనే ఈ జీవుడికి కొంత విశ్రాంతి ఇస్తాడు. అలా కొంతకాలము విశ్రాంతిలో ఉన్న తరువాత నిద్రలో స్వప్నం వచ్చినట్లుగా విశ్రాంతిలోనుండి జీవుడికి కొత్త జన్మ ప్రారంభమవుతుంది. పరమేశ్వరుడు ఏమి చేస్తాడు అంటే దేహం చనిపోయేటప్పుడు ఏ వాసన బలీయంగా ఉందో చూసి దానికి అనుగుణమైన జన్మను ఇస్తాడు. ఈ జన్మలు అన్నీ స్వప్నసమానమే. వాసనలుబట్టి దేహములు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అన్నీ స్వప్నసమానమే. స్వప్నం గాఢనిద్రలో వస్తుంది. అలాగే జనన, మరణములు అన్నీ అజ్ఞానము అనే నిద్రలో జరిగిపోతాయి. ఈ అజ్ఞానము అనే నిద్రనుండి నిన్ను మేల్కొలిపేవాడే గురువు.

దేహం ఏదో రోజు మరణిస్తుంది. మరణంలేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. అది నీ దేహంలో ఒక భాగముకాదు. దేహం మరణించకముందే ఆ మరణం లేని వస్తువు నీ అనుభవంలోనికి తెచ్చుకుంటే మరణంలేని స్థితికి నీవు ఎదిగి వెళ్ళిపోతావు. అది అంతటా వ్యాపించి ఉంది. దానిని తెలుసుకుంటే నీవుకూడా అంతటా వ్యాపించి ఉన్నావు అని నీకు తెలుస్తుంది. అది తెలిసేవరకూ నీకు ప్రయాణములు తప్పవు.

నీ గమ్యంగా నన్నే పెట్టుకో. నన్ను జేరటానికి ఉపాయంగా కూడా నన్నే పెట్టుకో అంటున్నాడు కృష్ణుడు. మనంచేసేపని ఆయన అనుగ్రహం సంపాదించటానికి అనుగుణంగా ఉండాలి. ఆయన అనుగ్రహం ఎప్పుడైతే వచ్చిందో ఆయన స్వరూపమును మనకు ఇచ్చేస్తాడు. నీవు చేసేపనిలో, నీవు చేసే సాధనలో గమ్యం భగవంతుడు అయి ఉండాలి. భగవంతుడిని మనం పూజిస్తున్నాము గాని వాడిని గమ్యంగా పెట్టుకోము. వేరే కోరికలు ఉంటాయి. అవి పొందటంకోసం భగవంతుని ప్రార్థిస్తున్నాము. అలాకాదు భగవంతుడుని పొందటానికి మన సాధన అంతాకూడా కేంద్రీకృతమవ్వాలి. ఇది బాగా అర్థంచేసుకోండి.

భయము, రాగము, ద్వేషము ఈ వికారములు అన్నీ మనస్సులోనుండి వస్తున్నాయి. మనస్సు నశిస్తే ఇవి అన్నీ నశిస్తాయి. రాగము వలన శక్తి వృధా అవుతుంది. Attachment వలననే మనం పొరపాట్లు చేస్తున్నాము. Attachment is sin అన్నారు భగవాన్. ఉన్నదేదో ఉంది. లేనిది ఏదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు. లేని దానికి ఉండటం అంటూ లేదు. ఇది నిశ్చయము అని భగవంతుడు కృష్ణుడు చెప్పాడు. కృష్ణుడు చెప్పిన ఈ వాక్యమును బాగా మననంచేసుకోండి. ఈ వాక్యం అర్థమయితే మీకు భయం, ఆందోళన తగ్గుతాయి. భగవంతునిమీద సజీవమైన విశ్వాసం కలిగి ఉంటే ఆయనను తెలుసుకొనే బుద్ధిని ఆయనే ప్రసాదిస్తాడు. జ్ఞానం సంపాదించటానికి డబ్బు అక్కరలేదు. జ్ఞానమును సంపాదించాలనే కాంక్ష దీనికి పెట్టుబడి. డబ్బుతో దీనికి సంబంధము లేదు.

* * *